## తెరుచుకున్న ఈఎస్ఐ డిస్పెన్సరీ



డిస్పెన్సరీ తాళాన్ని తీస్తున్న భవన యజమాని లింగ కృష్ణమూర్తి, సీఐ నర్సింహారెడ్డి

మేడ్చల్, డిసెంబరు 12: ఈఎస్ఐ డిస్పెన్సరీ తెరుచుకుంది. సీఐ నర్సింహారెడ్డి, పలువురు నేతలు జోక్యం చేసుకొని, తాళం తెరవడానికి కృషి చేశారు. 'అద్దె చెల్లించలేదని ఈఎస్ఐ డిస్పెన్సరీకి తాళం' అన్న శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురించిన కథనానికి స్పందన వచ్చింది. స్థానిక నేతలు భవన యజమాని లింగకృష్ణమూర్తిని కలిసి రోగుల ఇబ్బందుల దృష్ట్యా తాళం తెరవాలని కోరారు. ఆ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడించారు.వెంటనే గత ఏడాది సెప్టెంబర్, డిసెంబర్ కు సంబంధించి అద్దె చెల్లించడానికి చర్యలు తీసుకుంటామని, ఈ ఏడాదికి సంబంధించిన అద్దె కూడా వెంటనే మంజూరయ్యేలా చూస్తానని హామీ ఇవ్వడంతో తాళం తెరిచారు.

## రాజీవ్ గృహకల్ప కాలనీలో వసతులు కల్పించాలి

మేడ్చల్ కలెక్టరేట్, డిసెంబర్ 12: దమ్మాయిగూడ మున్సిపాలిటీ రాజీవ్‌గృహకల్ప కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కాలనీ వాసులు పోతరాజు రాములు,సిరిసిల్ల శ్రీనివాస్ మంగళవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అక్కడ అధికారులకు వినతిపత్రం అందజేశారు. 10వేల జనాభా ఉన్న కాలనీలో షాపింగ్ కాంప్లెక్స్, కమ్యూనిటీ హాల్, బస్‌స్టాప్, వైకుంఠధామం,రేషన్ షాపును ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

## కొర్రెములకు అదనపు బస్సులు నడపాలి



ఎమ్మెల్యే మల్లారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నాగరాజు తదితరులు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 12: కొర్రెముల గ్రామానికి అదనపు బస్సులు నడిపేలా చర్యలు చేపట్టాలని ఆ గ్రామానికి చెందిన మండల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బైనగారి నాగరాజు ఆధ్వర్యంలో మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే మల్లారెడ్డిని మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. మండల పరిధి కొర్రెముల గ్రామానికి కోఠి, సికింద్రాబాద్, ఉప్పల్ నుంచి పలు బస్సులు నడిచేవని, కరోనా సమయంలో బస్సులను రద్దు చేసి మళ్లీ పునరుద్ధరించలేదని పేర్కొన్నారు. రద్దు చేసిన బస్సులను వెంటనే పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని వారు కోరారు. అనంతరం చెంగిచెర్ల డిపో మేనేజర్‌ను సైతం కలిసి వారు వినతి పత్రం అందజేశారు.

## అభివృద్ధి పనులు ప్రారంభించాలని వినతి



మేయర్ బుచ్చిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బోడుప్పల్, డిసెంబర్12: ఎన్నికల కోడ్‌లో భాగంగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని మేయర్ సామల బుచ్చిరెడ్డి, కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డికి మంగళవారం బోడుప్పల్ బీఆర్ఎస్ నాయకులు కొత్త చక్రపాణిగౌడ్, కాటపల్లి రాంచంద్రారెడ్డి, వినతి పత్రం ఇచ్చారు. ఎన్నికల కోడ్ వల్ల సుమారు రూ.20 కోట్ల అభివృద్ధి పనులు ఆగిపోయాయని తెలిపారు. కార్యక్రమంలో 11వ డివిజన్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌రెడ్డి, లడ్డూబాయ్ తదితరులు పాల్గొన్నారు. బోడుప్పల్ పరిధి 23వ డివిజన్‌లో ప్రధాన, అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయని, మరమ్మతులు చేయాలని బీఆర్ఎస్ డివిజన్ ఇన్‌చార్జి శత్రజ్ఞ మంగళవారం మేయర్ బుచ్చిరెడ్డికి, కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వాసవినగర్, గాయత్రీహిల్స్‌లోని రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని వినతి పత్రంలో పేర్కొన్నారు.

## గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి



అవుషాపూర్‌లో రోడ్డుపై పారుతున్న మురుగునీటిని పరిశీలిస్తున్న ఎంపీపీ సుదర్శన్ రెడ్డి తదితరులు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 12: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి సూచించారు. మండల పరిధి అవుషాపూర్‌లో అధికారులు, సర్పంచ్ కావేరితో కలిసి మంగళవారం పలు వీధుల్లో ఆయన పర్యటించారు.రోడ్లపై మురుగు నీరు పారుతుంటే ఏం చేస్తున్నారని అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు ఎందుకు పర్యవేక్షించడం లేదని ఆయన ప్రశ్నించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఎంపీపీ సుదర్శన్ రెడ్డి వెంట ఎంపీవో నందకిషోర్, ఏఈ శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సునీత, నాయకులు మహేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సాయిలు, బాలకృష్ణ యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నాగారం మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తాం..



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి, కౌన్సిలర్ సబిత

మేడ్చల్ కలెక్టరేట్, డిసెంబర్ 12: నాగారం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు సాయి నివాస్ కాలనీలో రూ. 10లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను మంగళవారం చైర్మన్ ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సబిత, నాయకులు ఆంజనేయులుగౌడ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చర్యలు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నదని కలెక్టర్ గౌతమ్ అన్నారు. జిల్లాలోని రెవెన్యూ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఇతరుల స్వాధీనంలో ఉన్నట్లయితే వెంటనే నోటీసులు జారీ చేసి.. వాటిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలన్నారు. కబ్జాకు గురైన భూములను గుర్తించి వెంటనే పోలీసు బలగాలతో సంబంధిత ప్రదేశంలో ప్రభుత్వ భూమి.. అని సూచించేలా బోర్డులు, కంచెలను ఏర్పాటు చేయాలని తహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ భూములు కబ్జా చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని రెవెన్యూ అధికారులతో 15 రోజులకు ఒకసారి సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామన్నారు.ఈ సమావేశంలో ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలను సహించం..

జవహర్‌నగర్, డిసెంబర్ 12: సర్కారు భూమిలో అక్రమ నిర్మాణాలను సహించమని, కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కాప్రా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో అక్రమ కట్టడాలను తహసీల్దార్ మతిన్ ఆదేశాల మేరకు కూల్చివేయించారు.

## క్రీడల్లో గెలుపోటములు సహజం

మేడ్చల్, డిసెంబరు 12: క్రీడల్లో గెలుపోటములు సహజమని సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థల జాయింట్ సెక్రెటరీ అనంత లక్ష్మి అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపూర్‌లోని గురుకుల పాఠశాలలో నాలుగు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రజితారాజమల్లారెడ్డి, జడ్పీటీసీ శైలజావిజయానందారెడ్డి, గురుకుల సంస్థ రాష్ట్ర క్రీడాధికారి రామలక్ష్మణ్, ఆర్‌సీవో నాగకల్యాణి, డీసీవో సుధాకర్, కౌన్సిలర్ గణేశ్, కిష్టాపూర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శైలజతో పాటు వివిధ కళాశాలలు, పాఠశాలల ప్రిన్సిపాళ్లు నుస్రత్, లక్ష్మి, మల్లారెడ్డి, మధులత, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కీసర, డిసెంబర్ 12:రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా, రామన్నపేటకు చెందిన ఫొటో గ్రాఫర్లు అజయ్, అర్జున్, కిరణ్, ప్రద్వీప్, కృష్ణ, చరణ్ హన్మకొండలో జరిగిన ఓ వివాహ వేడుకకు సోమవారం వెళ్లారు. తిరిగి మంగళవారం తెల్లవారుజామున రామన్నపేటకు కారులో వస్తున్నారు. ఈ క్రమంలో కీసర మండలం యాద్గార్‌పల్లి చౌరస్తా వద్ద వారు ప్రయాణిస్తున్న కారు ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురిలో అజయ్ అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా మిగతా ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న కీసర పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయాలైన వారిని నగరంలోని ఓ దవాఖానకు తరలించారు. పోలీసులు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం



లక్ష్మి



ఆంథోనీ



నందిని(ఫైల్)

జవహర్‌నగర్, డిసెంబర్ 12: వేర్వేరు చోట్ల ముగ్గురు వ్యక్తులు అదృశ్యమయ్యారు. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం కథనం ప్రకారం... కౌకూర్ రాజీవ్ గృహకల్పలో నందిని కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటుంది. నందిని (28) ఈనెల 8న ట్యూషన్ చెప్పడానికని ఇంటి నుంచి వెళ్లింది. తిరిగి ఇంత వరకు ఇంటికి రాలేదు. మరో ఘటనలో దమ్మాయిగూడ న్యూ భవానీనగర్‌లో మానస రిక్రియేషన్ సెంటర్ నుంచి లక్ష్మి(47) మతిస్థిమితం లేని మహిళ ఈనెల 9న బయటకు వెళ్లి అదృశ్యమైంది. జవహర్‌నగర్ బాలాజీనగర్‌కు చెందిన జోసెఫ్ ఆంథోని(35) ఈనెల 1న ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంత వరకు తిరిగిరాలేదు. వీరి ఆచూకీ కోసం వారి కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లభించలేదు. మంగళవారం ఆయా కుటుంబాల సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కీసర, డిసెంబర్ 12: కీసరదాయరకు చెందిన నక్క సుక్కమ్మ మంగళవారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ రమేశ్‌గుప్త, ఆమె మృతికి సంతాపం ప్రకటించారు. అనంతరం వారి కుటుంబానికి ఆయన రూ.5వేల ఆర్థిక సాయం చేశారు.

## నేటి నుంచి అయ్యప్ప స్వామి ఆలయ ప్రారంభ మహోత్సవాలు



ప్రారంభోత్సవానికి సిద్ధమైన అయ్యప్ప ఆలయం

కీసర, డిసెంబర్ 12: కీసరలో దాతల సహకారంతో నిర్మించిన శ్రీ హరిహరపుత్ర వరాల అయ్యప్ప స్వామి ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను నేటి నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప భక్తమండలి కమిటీ అధ్యక్షులు నల్లా బాల్‌రెడ్డి గురుస్వామి తెలిపారు. వేదపండితులు సాయికిరణ్ శర్మ, సందీప్‌శర్మ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా అయ్యప్ప ఆలయానికి రాయిల కృష్ణమూర్తిగుప్త జ్ఞాపకార్థం ఆయన కుమారులు రూ.2,01,000లక్షలను అయ్యప్ప భక్తమండలి సభ్యులకు విరాళంగా అందజేశారు.

## అబ్బన్నకుంటలో యువతి మృతదేహం లభ్యం

శామీర్‌పేట, డిసెంబర్ 12: చెరువులో గల్లంతైన యువతి మృతదేహం లభ్యమైంది. శామీర్‌పేట మండలం బొమ్మరాశిపేట గ్రామానికి చెందిన మెలుగు కవిత,తన తల్లి కలమ్మతో కలిసి సోమవారం బర్రెలను మేపడానికి వెళ్లింది. ప్రమాదవశాత్తు బొమ్మరాశిపేట గ్రామ పరిధిలోని అబ్బన్నకుంటలో కవిత, ఆమె తల్లి కాలు జారి కుంటలో పడ్డారు. కవిత నీటిలో మునగగా, నీటిపై తేలియాడుతున్న కలమ్మ మృతదేహాన్ని సోమవారమే బయటకు తీసి గాంధీ మార్చురీకి తరలించారు. కవిత మృతదేహం కోసం వెతకగా మంగళవారం కుంటలో లభ్యమైంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసున్నారు.

## సర్కారు భూమి కబ్జా... ఏడీ సర్వేకు ఆదేశాలు

శామీర్‌పేట, డిసెంబర్ 12: ఆద్రాస్‌పల్లిలో ప్రభుత్వ భూమి కబ్జా విషయంలో గ్రామస్తులు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఆ విషయంలో మూడుచింతలపల్లి మండలం ఆద్రాస్‌పల్లి గ్రామంలోని సర్వే నంబర్ 235 ప్రభుత్వ భూమిని కీసర ఆర్డీవో రాజేశ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ భూమి కబ్జాపై వచ్చిన విషయంలో ఏడీ సర్వేకు ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వాణిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.